

మలబార్ గోల్డ్, డైమండ్స్‌లో మైన్ డైమండ్ షోను ప్రారంభిస్తున్న ప్రతినిధులు

## మైన్ డైమండ్ షో ప్రారంభం

ఆర్కేపురం, డిసెంబర్ 27 : కొత్తపేటలోని మలబార్ గోల్డ్, డైమండ్స్ షోరూమ్‌లో మైన్ డైమండ్ షోను బుధవారం వినియోగదారులు, శ్రేయోభిలాషులు, మలబార్ గోల్డ్, డైమండ్స్ ప్రతినిధుల సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూం హెడ్ రదీష్ కుమార్ మాట్లాడుతూ ఈ డైమండ్ షోలో రోజూ ధరించే నగలు, వివాహ ఆభరణాలు, లైట్ వెయిట్ ఆభరణాలు, పురుషుల ఆభరణాలు, ప్లాటినం ఆభరణాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ నెల 31 వరకు ప్రదర్శన ఉంటుందని చెప్పారు. పాత మైన్ డైమండ్ ఆభరణాల మార్పిడిపై వినియోగదారులు 100శాతం విలువను పొందవచ్చని, కొత్తగా కొనుగోలు చేసిన డైమండ్ విలువపై 25శాతం వరకు తగ్గింపు లభిస్తుందని అన్నారు.



## ఇండియన్ డిజైనర్ హోథ్ ప్రదర్శన ప్రారంభం

బంజారాహిల్స్, డిసెంబర్ 27 : బంజారాహిల్స్‌లోని తాజ్ కృష్ణాలో ఏర్పాటు చేసిన ఇండియన్ డిజైనర్ హోథ్(ఐడీహెచ్) ఫ్యాషన్ ఎగ్జిబిషన్‌ను బుధవారం టాలీవుడ్ హీరోయిన్లు స్రవంతి చొక్కారపు, ఊర్మిళా చౌహాన్ ప్రారంభించి సందడి చేశారు.




సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్ రావు

## ఉద్యోగుల ప్రయోజనాలే లక్ష్యం

ఖైరతాబాద్, డిసెంబర్ 27 : ఉద్యోగుల ప్రయోజనాలే లక్ష్యంగా తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం పనిచేస్తుందని ఆ సంఘం వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ఎలూరి శ్రీనివాస్ రావు అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పూర్తి స్థాయి కార్యవర్గాన్ని ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించి ఎన్నుకుంటామని తెలిపారు. అందుకోసం ఉమ్మడి పది జిల్లాలు, సచివాలయం, హైదరాబాద్ నగరానికి కన్వీనర్లను నియమించి వారి ద్వారా ఎన్నికలు జరిపిస్తామన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమంలో అధికారులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు బి.శ్యామ్, రామకృష్ణ గౌడ్, పరమేశ్వర్ రెడ్డి, రవికుమార్, నర్సింహులు, మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రేపు మేడ్చల్ కలెక్టరేట్‌లో జాబ్ మేళా

మేడ్చల్ కలెక్టరేట్, డిసెంబర్ 27 : మేడ్చల్ కలెక్టరేట్‌లో ఈ నెల 29న జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.వై.నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి గల యువతి, యువకులు WWW.NIC.GOV.IN లో రిజిస్టర్ చేసుకొని హాజరు కావాలని, ఉదయం 11నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జాబ్ మేళా జరుగుతుందని తెలిపారు.

## మ్యాన్‌మేడ్ హిల్‌ను సందర్శించిన నిజాం వారసుడు

సిటీబ్యూరో, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ) : ఆసఫ్ జాహీ 9వ నిజాం వారసుడైన నవాబ్ రౌనక్ యార్‌ఖాన్ జూబ్లీహిల్స్ రోడ్ నం. 25లోని 80 ఎకరాల స్థలంలో నిర్మించిన మ్యాన్‌మేడ్ హిల్‌ను తన తోటి 1975 బ్యాచ్ హెచ్‌పీఎస్ సన్నిహితులతో కలిసి సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన టీ పార్టీలో పాల్గొన్నారు. కాగా తన హెచ్‌పీఎస్ తోటి విద్యార్థులంతా ఒకటి కావడం సంతోషంగా ఉన్నదని తెలిపారు.

# అలా నింగిలో తేలిపోదాం.. వస్తావా!



వినూత్న థీమ్స్‌తో రారమ్మంటున్న ఈవెంట్స్

నగరంలో మొదలైన న్యూ ఇయర్ జోష్

జోష్‌ఫుల్ పార్టీలకు ముస్తాబవుతున్న క్లబ్స్, హోటల్స్, రెస్టారెంట్స్, రిసార్ట్స్

స్పెషల్ సాంగ్స్‌తో అలరించనున్న సినీ తారలు

లైవ్ మ్యూజిక్‌తో ఆకట్టుకోనున్న సంగీత బృందాలు

ప్రత్యేక ప్యాకేజీలు అందుబాటులోకి..

సిటీబ్యూరో, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ) : మరో రెండు రోజుల్లో కొత్త ఏడాదిలోకి అడుగుపెట్టబోతున్నాం. 2023కి గుడ్‌బాయ్ చెప్పి 2024ను ఆహ్వానించబోతున్నాం. ఈ ఏడాది ముగియడంలో 'డిసెంబర్ 31'కి ఉండే క్రేజే వేరు. ప్రతి ఒక్కరూ ఆ రోజు ఆనంద డోలికల్లో మునిగితేలాలని ఉవిళ్లూరుతారు. కొత్త కొత్త ఆశలతో మధురానుభూతులను అందించాలని కోరుకుంటూ కొత్త ఏడాదికి నగరవాసులు స్వాగతం పలకాలని కోరుకుంటారు. వీరి ఆనందానికి ఏ మాత్రం డోకా లేకుండా అంతకు మించి అన్నట్టుగా నగరంలోని హోటళ్లు, రిసార్టులు, పబ్‌లు నయా జోష్‌కు సిద్ధమయ్యాయి. మిరుమిట్లు గొలిపే ఈవెంట్లు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించారు. ప్రముఖ మ్యూజిక్ బ్యాండ్లతో నగరానికి చెందిన డీజేలతో పార్టీలను హీటెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అంతేకాదు ఒకరికి ఒకరూ పోటీ అన్నట్టుగా ప్రముఖ సినీ తారల డేట్స్ బుక్ చేసి ఈవెంట్స్‌లో అలరించేల ఏర్పాట్లు చేస్తున్నారు. సరికొత్త ప్యాకేజీలతో ప్రత్యేక రాయితీలతో పార్టీలు నిర్వహించేందుకు నిర్వాహకులు సిద్ధమయ్యారు.

### పార్టీకి వేదికలెన్నో..!

నగరంలో కొత్త ఏడాది పార్టీకి సర్వం సిద్ధం చేసుకుంటున్నారు నిర్వాహకులు. విభిన్న ప్రాంతాల్లో వినూత్న థీమ్‌తో పార్టీలను ఈవెంట్ ఆర్గనైజర్లు ప్లాన్ చేశారు. ఇప్పటికే ఆసక్తిగల వారు తమకు నచ్చిన ప్యాకేజీలను ఎంపిక చేసుకుటున్నారు. రూ.2 వేల నుంచి ఆపై ధరలు ఉన్నాయి. అధికంగా అన్‌లిమిటెడ్ ఫుడ్, లిక్కర్ అందిస్తున్న ప్యాకేజీలకు అధికంగా డిమాండ్ వస్తుంది. కంట్రీ క్లబ్ ఆధ్వర్యంలో వార్ ఆఫ్ ది డీజే థీమ్‌తో రసూల్‌పురాలోని పోలీస్ హాకీ స్టేడియంలో సాయంత్రం 7 నుంచి వేడకలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ తారలు, డీజే ఎక్స్‌పర్ట్స్ పాల్గొంటారు. కొంపల్లిలోని 10 డౌనింగ్ స్ట్రీట్‌లో న్యూ ఇయర్ ఈవ్ బాష్ వేడుకకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ప్రిసం సర్కస్‌లో లైట్స్, సౌండ్స్, లేసర్ ఫైర్ వర్క్స్, మ్యాజిక్ ఆఫ్ ఎస్ఎఫ్ఎక్స్, అన్‌లిమిటెడ్ లిక్కర్, ఫుడ్‌తో అదిరిపోయేల కొత్త ఏడాదికి స్వాగతం పలికేందుకు సిద్ధంచేశారు. సావిఫార్మ్స్‌లో ఓపెన్ డీజే డ్యాన్స్, ఫుల్ పార్టీ, మాస్క్ థీమ్డ్ పార్టీతో వేడుకలు జరగనున్నాయి. దీనికి ప్రముఖ డీజే జైన్ సత్రి, నవాబ్స్ పాల్గొంటారు. చిరాన్ ఫోర్ట్ ఆధ్వర్యంలో న్యూ ఇయర్ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. శాఫ్రాన్ వాల్యూలో స్టార్ నైట్ పేరుతో అన్‌లిమిటెడ్ ఫుడ్, లిక్కర్, లియా లిస్సే, డీజే పండు మాస్టర్, జాయ్-ఎస్ సందడి చేయనున్నారు. హైటెక్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో మ్యుజిషియన్ కాప్రిసియో, డీజే పృథ్వీ సాయి అలరించనున్నారు.




పోస్టల్ కవర్‌ను ఆవిష్కరిస్తున్న ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

### భారత్-2047 దార్శనికత కాదు..

# మానవాళికి గొప్ప మార్గదర్శక శక్తి

కొండా శత జయంతి కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్

సిటీబ్యూరో, డిసెంబర్ 27(నమస్తే తెలంగాణ) : నేటి తరానికి స్ఫూర్తి ప్రదాతగా జస్టిస్ కొండా మాధవరెడ్డి నిలుస్తారని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ తెలిపారు. దివంగత జస్టిస్ కొండా మాధవరెడ్డి 100వ జయంతి సందర్భంగా రాష్ట్ర గవర్నర్ డా.తమిళిసై సౌందరరాజన్ అధ్యక్షతన హైదరాబాద్ గగన్ మహల్‌లోని ఏవీ కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై ప్రత్యేక పోస్టల్ కవర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ మాట్లాడుతూ కొండా మాధవరెడ్డి ఏపీ, ముంబై హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తిగా, మహారాష్ట్ర గవర్నర్‌గా పనిచేశారని అన్నారు. దూరదృష్టితో న్యాయ, విద్యా వ్యవస్థ అభివృద్ధికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. న్యాయ వ్యవస్థ, కార్యనిర్వాహక, లెజిస్లేచర్ ప్రశంసనీయంగా పనిచేస్తున్నాయని, దేశంలో దశాబ్ద కాలంగా న్యాయ వ్యవస్థలో గణనీయమైన పురోగతి సాధించామని పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థను అన్ని వర్గాలకు చేరువ చేసేలా స్థానిక భాష వినియోగంలోకి వచ్చిందన్నారు. 99శాతం జిల్లా కోర్టులు సంబంధిత హైకోర్టులకు అనుసంధానం, కొత్తగా క్రిమినల్ కోడ్ బిల్లులకు భారత రాష్ట్రపతి ఆమోదం, శిక్ష కంటే న్యాయంపై దృష్టి పెట్టాయన్నారు. భారత్-2047 అనేది కేవలం దార్శనికత మాత్రమే కాదని.. రానున్న దశాబ్ధ కాలంలో మానవాళికి గొప్ప మార్గదర్శక శక్తిగా మారుతుందన్నారు. జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కొండా మాధవ రెడ్డి జీవిత సారాంశం, ఆయన రచనలు, విలువలు ఎనలేనివన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి అలోక్ ఆరాధే, భారత సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి, తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ పీవీఎస్ రెడ్డి, ఉస్మానియా వర్సిటీ మాజీ ప్రొఫెసర్ రాంచంద్రారెడ్డి, వీఆర్ రెడ్డి, జస్టిస్ ఎంఎస్కే జైస్వాల్, పలువురు సిట్టింగ్, మాజీ న్యాయమూర్తులతోపాటు, న్యాయవాద సంఘాల సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## రేపు మల్లేపల్లిలో జాబ్ మేళా

సిటీబ్యూరో, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 29వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారిని మైత్రి ప్రియ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్లేపల్లిలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 8008971739 లేదా www.employment.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

# నగరానికి 540 అద్దె బస్సులు

మొదటి విడతలో 340 డీజిల్ బస్సులకు టెండర్లు

జనవరి 3 నుంచి అందుబాటులోకి వచ్చే అవకాశం.?

త్వరలోనే మరో 200 బస్సులకు కూడా..

సిటీబ్యూరో, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ) : ఈ ఏడాది మార్చి నెలాఖరు వరకు ఆర్టీసీ గ్రేటర్ జోన్ పరిధిలో 560 వరకు విద్యుత్ బస్సులు ఏర్పాటు చేయాల్సి ఉన్న ఆర్టీసీ యాజమాన్యం ప్రస్తుతం ఆ దిశగా ముందుకు సాగడం లేదు. ఎప్పటి వరకు విద్యుత్ బస్సులు ఏర్పాటు చేస్తారనేది అధికారులు చెప్పలేకపోతున్నారు. ఒక పక్క మహాలక్ష్మి పథకం నేపథ్యంలో ప్రస్తుతం నగరంలో తిరుగుతున్న బస్సులన్నీ కిటకిటలాడుతున్నాయి. ప్రయాణికులకు సరిఫడా బస్సులు లేకపోవడంతో 2010కి ముందు కొనుగోలు చేసిన డీజిల్ బస్సులను నడుపుతున్నారు. అదే విధంగా విద్యుత్ బస్సులు కొనుగోలు చేయడానికి బదులుగా వాటి స్థానంలో 340 డీజిల్ బస్సులు (బీహెచ్-4) అద్దె ప్రాతిపదికన కొనుగోలు చేసే కార్యక్రమానికి ఆర్టీసీ యాజమాన్యం శ్రీకారం చుట్టింది. ఈ నెల 15న టెండర్ నోటిఫికేషన్ జారీ చేసి 22 నుంచి ఆన్‌లైన్ టెండర్ల దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభించారు. జనవరి 3వరకు గడువు విధించడంతో పాటు అదే రోజు టెండర్లు ఓపెన్ చేసే అవకాశాలు ఉన్నట్లు టెండర్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. గురువారం జేబీఎస్‌లోని రెండో అంతస్థులో అద్దె బస్సుల ప్రీ బిడ్డింగ్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. త్వరలోనే మరో 200 డీజిల్ బస్సులకు కూడా టెండర్లు పిలువబోతున్నారు. అందుకోసం సంబంధించి విధి విధానాలు రూపొందిస్తున్నారు.